సాక్షి
మెదక్
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



సై సై మేడారం జాతర

మేడారం జాతరకు భక్తులు సిద్ధం అవుతున్నారు. సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు మేడారం వైపు పయనమవుతున్నారు. వివరాలు 8లో ▸



పెళ్లి బస్సు, లారీ ఢీ

బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా 10 మందికి గాయాలయ్యాయి. ఈసంఘటన నిజాంపేట శివారులో జరిగింది. వివరాలు 8లో ▸

నేడు మెదక్‌కు మంత్రి రాక

మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం మెదక్ జిల్లా కేంద్రానికి రానున్నారు. మెదక్‌లో నూతనంగా నిర్మించిన భరోసా సెంటర్‌ను ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నారు. అనంతరం మెదక్ నుంచి బయల్దేరి తూప్రాన్ మీదుగా హైదరాబాద్ వెళ్తారని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

సమ్మెను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సాపూర్: ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేసురత్నం పిలుపునిచ్చారు. బుధవారం నర్సాపూర్‌లో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు, మతతత్వ ధోరణులకు వ్యతిరేకంగా చేపట్టే సమ్మెను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి నందం, ఇతర ప్రతినిధులు లక్ష్మి, జగన్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు

హవేళిఘణాపూర్(మెదక్): ప్రజలు ఆవేశంలో గొడవ పడితే వాటిని లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు పేర్కొన్నారు. మండల పరిధిలోని రాజ్‌పల్లిలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలను వేధింపులకు గురి చేస్తే షీ టీంకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు తమ హక్కులకు భంగం వాటిల్లితే తమను సంప్రదిస్తే వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

నేడు ప్రత్యేక సభలు



మాట్లాడుతున్న డీపీఓ యాదయ్య

మెదక్ కలెక్టరేట్: స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ముగింపు సందర్భంగా గురువారం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక సభలు నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య తెలిపారు. నూతనంగా బదిలీపై మెదక్ వచ్చిన ఆయన బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈనెల 7 నుంచి చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు గురువారం ముగియనున్నట్లు చెప్పారు. ముగింపు సందర్భంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక సభలు ఏర్పాటు చేసి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

ప్రయోగ పరీక్షలకు 30 మంది గైర్హాజరు

మెదక్ కలెక్టరేట్: ఇంటర్ ప్రయోగ పరీక్షలకు బుధవారం జిల్లావ్యాప్తంగా 903 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల నోడల్ అధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సమయాల్లో జనరల్, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించగా 933 మంది హాజరు కావాల్సి ఉండగా 30 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

కొండపోచమ్మ హుండీ ఆదాయం రూ.12.23 లక్షలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండపోచమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.12.23 లక్షలు వచ్చినట్లు ఆలయ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. 59 రోజులకు సంబంధించిన హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారికి హుండీ, కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని ఆలయ ఖాతాలో జమచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, చిన్నా, సుధాకర్ చందు, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, హరి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నిర్మించారు.. వదిలేశారు

- నిరుపయోగంగా నిరాశ్రయుల కేంద్రం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



నిరుపయోగంగా నిరాశ్రయుల ఆశ్రమ కేంద్రం

మెదక్: ఏ దిక్కులేని అనాథలను ఆదుకునేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన నిరాశ్రయుల ఆశ్రమ కేంద్రం నిరుపయోగంగా మారింది. జిల్లా కేంద్రంలో గతేడాది మేలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) నిధులతో రూ.65 లక్షలు వెచ్చించి పట్టణ పరిధిలోని మాతా శిశు సంక్షేమ కేంద్రం (ఎంసీహెచ్) పక్కన నిర్మించారు. కాని పర్యవేక్షణ మాత్రం మరిచారు. దీంతో అభాగ్యులు అవస్థలు పడుతున్నారు.



మడిగల వెంట నిద్రిస్తున్న అనాథలు (ఫైల్)

ఆర్భాటంగా ప్రారంభం

తొమ్మిది నెలల క్రితం అప్పటి ఎమ్మెల్యే పద్మ చేతుల మీదుగా నిరాశ్రయుల ఆశ్రమ కేంద్రం ప్రారంభించారు. అందులో ఇప్పటి వరకు ఒక్కరిని కూడా చేర్చలేదు. ఎవరికీ ఆశ్రయం కల్పించలేదు. నిబంధనల ప్రకారం మున్సిపల్ పాలకపక్షం, కమిషనర్, పోలీస్‌శాఖ, సమైక్య సభ్యులు, మెప్మా సిబ్బందితో కమిటీలు ఏర్పాటు చేశారు. వారు నిరాశ్రయులైన అనాథలు, భిక్షాటన చేసే వారిని గుర్తించి ఆశ్రయం కల్పించాల్సి ఉంటుంది. కానీ పాలకులు, అధికారులు ఆ దిశగా ఆలోచించడం మరిచారు. ఫలితంగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్, ఫుట్‌పాత్‌లపైన చలికి వణుకుతూ, వర్షానికి తడుస్తూ, ఎండకు ఇబ్బంది పడుతూ కాలం వెల్లదీస్తున్నారు.

కాంట్రాక్టర్‌కు కలిసొచ్చింది

నిరాశ్రయుల కేంద్రం పక్కనే క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవనాన్ని ఓ కాంట్రాక్టర్ నిర్మిస్తున్నారు. నిర్మాణానికి ఉపయోగించే పనిముట్లతో పాటు భవనాన్ని నిర్మించే కార్మికులు దానిని ఉపయోగించుకుంటున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ భవనం కాంట్రాక్టర్‌కు మాత్రం ఉపయోగపడుతుంది. మున్సిపల్ సిబ్బంది, పాలకపక్షానికి తెలిసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. నూతనంగా అధికారంలోకి వచ్చిన పాలకులైనా పట్టించుకొని దానిని వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం

పట్టణంలోని ఎంసీహెచ్ ఆస్పత్రి సమీపంలో నిర్మించిన నిరాశ్రయుల కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం. సంబంధిత అధికారులతో మాట్లాడి, అనాథలను గుర్తించి అందులో చేర్పిస్తాం.
– జానకిరాంసాగర్, మెదక్ మున్సిపల్ కమిషనర్

కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరాలి

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, పక్కన రఘునందన్‌రావు

వెల్దుర్తి(తూప్రాన్): కాళేశ్వరం అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదో ప్రజలకు వివరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన మాసాయిపేటలో బుధవారం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాలు కైవసం చేసుకుంటుందనే దురుద్దేశంతోనే కృష్ణానీళ్ల పేరుతో బీఆర్ఎస్, కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్ డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక జ్యుడీషియల్ ఎంక్వైరీ కోరుతూ రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. అసెంబ్లీలో పవర్‌ప్లాంట్ ప్రజెంటేషన్ ఇచ్చి మేడిగడ్డను సందర్శించడం వెనుక ఉన్న మర్మమేమిటో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. ఆదిలాబాద్, మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడిస్తామని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వేణుగోపాల్, చేగుంట మాజీ ఎంపీపీ పాండుతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్నపేటలో ఈనెల 16వ తేదీన విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు ఈశాఖ ఏడీ మోహన్‌బాబు తెలిపారు. విద్యుత్ పరంగా ఎలాంటి సమస్యలున్నా ఈసదస్సులో తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఉదయం పదకొండున్నర నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగే సదస్సును సబ్ డివిజన్ పరిధిలోని పెద్దశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్, పాపన్నపేట మండలాలకు సంబంధించిన వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వర్గీకరణ సాధించే వరకు ఉద్యమిస్తాం : టీఎమ్మార్పీఎస్

దౌల్తాబాద్(దుబ్బాక): ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం ఆగదని టీఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జిల్లా ఉపాధ్యక్షుడు జంగపల్లి సాయిలు ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా గుర్రాల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జోగు మహేందర్‌ను, ఉపాధ్యక్షుడిగా సూరంపల్లి కుమార్‌ను, ప్రధాన కార్యదర్శిగా డప్పు శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు మాదిగలను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారే తప్ప తమ ఆకాంక్షలు నెరవేర్చడం లేదన్నారు. ఈ నెల 28న రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆధ్వర్యంలో యాదగిరి గుట్టలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల భూపాల్, రాష్ట్ర కార్యదర్శి సిద్ధిని రాజమల్లయ్య, వెంకన్న, జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎన్ఆర్‌డీఎఫ్ బృందం

- జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు

శివ్వంపేట(నర్సాపూర్): విపత్తులు సంభవించినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, 10వ బెటాలియన్ ఎన్ఆర్‌డీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్ పిలుపునిచ్చారు. విపత్తులు చోటుచేసుకుంటే తీసుకోవాల్సి అంశాల గురించి బుధవారం రైతు వేదికలోఅవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, భూకంపాలు సంభవించినప్పుడు ఎలా వ్యవహరించాలో ఎన్డీఆర్ఎఫ్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో నర్సాపూర్ వ్యవసాయ సంచాలకులు సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారి లావణ్య, తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

‘గౌరవెల్లి’ పూర్తయితే మరి నీళ్లేవి?

- బీఆర్ఎస్ తీరుపై మంత్రి పొన్నం ఫైర్
- అసెంబ్లీలో రసవత్తర చర్చ



మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తే నీళ్లు ఎందుకు ఇవ్వలేదని బీఆర్ఎస్ నేతలను రవాణా, బీసీ సంక్షేమ శాఖ పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ప్రాజెక్టుకు సంబంధించి కాలువలే నిర్మించలేదన్నారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ప్రాజెక్టులపై రసవత్తరంగా చర్చ జరిగింది.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పుడు కాలువలు పారుతున్నాయంటే కాంగ్రెస్ హయాంలో నిర్మించినవేనని అన్నారు. వరద కాలువ, శ్రీ రాంసాగర్, ఎల్లంపల్లి, లోయర్ మానేర్ ప్రాజెక్టులను ఎవరు నిర్మించారో చరిత్ర చూస్తే తెలుస్తోందన్నారు. పదేళ్లుగా సిరిసిల్ల శాసన సభ్యుడిగా ఉండి అప్పర్ మానేరు పూర్తి చేయని కేటీఆర్ మాట్లాడితే ఎట్లా అని ప్రశ్నించారు. 2014లోనే 80 శాతం పూర్తయిన గౌరవెల్లి ప్రాజెక్టును పదేళ్లు పాలించిన కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు 80 శాతం ఇరిగేషన్‌తో వరి ఉత్పత్తిలో ఉభయ గోదావరి జిల్లాలతో పోటీ పడిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అని అన్నారు. ఎల్లంపల్లి, లోయర్ మానేర్ డ్యామ్‌లు నేను చిన్నగా ఉన్నప్పుడే నిర్మించారన్నారు. బీఆర్ఎస్ నాయకులు మేమే నిర్మించినట్లు చెబుతున్నారని అన్నారు. సభ నుంచి ఒక కమిటీ వేయాలని, ఎవరు అబద్ధాలు చెబుతున్నారో తెలుస్తుందన్నారు. హరీశ్‌రావు నియోజకవర్గంలో మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్ పూర్తి అవుతాయని, మా దగ్గర కుర్చీ వేసుకొని గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పిన కేసీఆర్ ఎందుకు చేయలేదని పొన్నం ప్రశ్నించారు.

ఆధునిక పద్ధతులే మేలు

- కలెక్టర్ రాజర్షిషా
- అగ్రిటెక్ సౌత్- 2024 పోస్టర్ ఆవిష్కరణ



కలెక్టర్ రాజర్షిషాతో జిల్లా అధికారులు

మెదక్ కలెక్టరేట్: రైతులు ఆధునిక వ్యవసాయ, సాంకేతిక పద్ధతులను అలవర్చుకోవాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అగ్రిటెక్ సౌత్- 2024 పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎగ్జిబిషన్, సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక అభివృద్ధిని రైతులకు పరిచయం చేసేందుకు భారత పరిశ్రమల సమాఖ్య ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో 1,000 మంది వ్యవసాయ సంబంధిత ప్రతినిధులతో చర్చా కార్యక్రమం ఉంటుందన్నారు. అగ్రిటెక్ సౌత్- 2024లో వ్యవసాయ ఉత్పత్తులు, వాటి పెంపకం, పునరుత్పత్తి వ్యవసాయం, పశు సంరక్షణ, చేపల పెంపకం, కోళ్ల పెంపకం, ఆయిల్‌పాం సాగు తదితర వాటి గురించి చర్చలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, వ్యవసాయ సహాయ సంచాలకులు వినయ్ కుమార్, రాజ్ నారాయణ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు

ఇటీవల జిల్లా నుంచి పలువురు జిల్లా అధికారులు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో ముగ్గురు జిల్లా అధికారులు బుధవారం మెదక్‌కు వచ్చారు. ఈసందర్భంగా బుధవారం కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిశారు. బదిలీపై వచ్చిన వారిలో జెడ్పీసీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, డీఆర్డీఓ శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



పాఠశాల భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపేటలో ప్రాథమిక పాఠశాల భవనానికి రెండెకరాల ప్రభుత్వ స్థలం కేటాయించగా మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాల శిథిలావస్థలో ఉండగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలకు భూమి కేటాయించడంతో నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని చెప్పారు. రెండెకరాల స్థలంలో పాఠశాల నిర్మిస్తే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి గతంలో బీటీ రోడ్డు మంజూరు కాగా పనులు జరగాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదాగౌడ్, మాజీ సర్పంచ్ మైసాగౌడ్, నాయకులు అమర్‌సింగ్, ప్రసాద్, సలీం, పాష, బాబర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాటల్లో కాదు చేతల్లో చూపిస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్: మాటల్లో కాదు అభివృద్ధి చేసి చూపుతానని ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్‌రావు అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత పాలకులు మాట్లాడితే వందలు, వేల కోట్లు అంటూ ప్రగల్భాలు పలికేవారని అన్నారు. మెదక్‌లోని మూడు చౌరస్తాలను అందంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. అలాగే నర్సాపూర్– మెదక్ రూట్‌లోని వెల్‌కం బోర్డు వద్ద సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేస్తానన్నారు. మైనంపల్లి సోషల్ సర్వీస్ కార్యక్రమాలు ఎల్లప్పుడూ నడుస్తూనే ఉంటాయన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు అనాథ పిల్లలకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను త్వరలో ప్రారంభిస్తామన్నారు. సొంత డబ్బులతో 100 వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఎంతో మంది మద్యం సేవించి ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. ఎస్పీతో మాట్లాడి మద్యం ప్రియులకు కౌన్సిలింగ్ ఇప్పిస్తానని చెప్పారు. సమావేశంలో నాయకులు జీవన్‌రావు, గంగా నరేందర్, హఫీజొద్దీన్, అంజనేయులు, తదితరులు ఉన్నారు.

అక్షర క్షేత్రం.. భక్తజన సంద్రం

- వైభవంగా సరస్వతీమాత వసంతోత్సవం
- దేవీనామంతో మారుమోగిన వర్గల్ శంభుని గిరులు



వర్గల్‌లో చిన్నారుల అక్షరాభ్యాసాల సందడి

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం భక్తులతో పోటెత్తింది. దేవీనామంతో శంభుని గిరులు మార్మోగాయి. సకల విద్యలకు మూలమైన సరస్వతీ అమ్మవారు నవరత్న ఖచిత స్వర్ణ కిరీట ధారిణియై దివ్యదర్శనమిచ్చారు. బుధవారం మాఘ శుద్ధ పంచమి సరస్వతీదేవి జన్మదినోత్సవం సందర్భంగా వర్గల్ క్షేత్రం వసంత పంచమి మహోత్సవ వేడుకలతో శోభిల్లింది. ఓ వైపు అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలు, మరోవైపు చిన్నారుల అక్షర స్వీకార పూజలతో క్షేత్రంలో ఆధ్యాత్మికతలు వెల్లివిరిశాయి. 45,000 పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ వేళ అమ్మవారి వైభవం ప్రత్యక్షంగా తిలకించి తరించారు. పర్వదినం సందర్భంగా 6,500 మంది చిన్నారులు అక్షరాలు దిద్దారు. శ్రీక్షేత్రం పీఠాధిపతి శ్రీమధుసూదనానంద సరస్వతి, పుష్పగిరి శ్రీవిద్యా శంకరభారతి స్వామి, ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం 4 గంటలకు వసంత పంచమి వేడుకలకు అంకురార్పణ జరిగింది. గణపతి పూజ అనంతరం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలలు, స్వర్ణకిరీటాది ఆభరణాలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. యజ్ఞశాలలో చండీహోమం నిర్వహించారు. మరోవైపు భక్తజన నృత్యాలు, భజనల మధ్య అమ్మవారు పూలపల్లకిలో గిరి ప్రదక్షిణ చేశారు. ఆలయ మండపంలో అమ్మవారి సామూహిక లక్ష పుష్పార్చన నేత్రపర్వం చేసింది.

అక్షర స్వీకారాలు

ఓ వైపు అమ్మవారికి అర్చనలు, మరోవైపు చిన్నారుల అక్షరాభ్యాసాల కార్యక్రమం కొనసాగింది. ఉదయం నుంచి రాత్రి వరకు అక్షరస్వీకారాలు కొనసాగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.



అమ్మవారి దివ్య మంగళరూపం

క్లుప్తంగా

నిషేధిత పేలుడు పదార్థాలు స్వాధీనం



పేలుడు పదార్థాలతో పోలీసులు

కోహెడ(హుస్నాబాద్‌): అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు హుస్నాబాద్‌ సీఐ ఎర్రల కిరణ్‌, ఎస్సై తిరుపతి తెలిపారు. మండల శివారులో నూతనంగా నిర్మాణంలో ఉన్న వెంచర్‌లోని ట్రాక్టర్‌లో పేలుడు పదార్థాలు 97 జిలెటిన్‌ స్టిక్స్‌, 100 డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నిషేధిత పేలుడు పదార్థాలు కరీంనగర్‌కి చెందిన ఓర్సు సమ్మయ్యకి చెందినవిగా గుర్తించామన్నారు. సదరు వ్యక్తి పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం సీఐ కిరణ్‌ మాట్లాడుతూ.. సర్కిల్‌ వ్యాప్తంగా అక్రమ కార్యక్రమాలపై నిఘా పెంచామని, ఎవరైనా పేలుడు పదార్థాలు రవాణ చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనర్హులకు యోగా సర్టిఫికెట్లు

చర్యలు తీసుకోవాలంటున్న యోగా గురువులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): అనర్హులకు యోగా సర్టిఫికెట్లు ఇవ్వడం సరికాదని పలువురు యోగా గురువులు బుధవారం ఒక ప్రకటనలో వాపోయారు. కరోనా మహమ్మారి ప్రభావం, రకరకాల కాలుష్యాలతో పెరుగుతున్న అనారోగ్యాల వల్ల యోగా విద్యకు, టీచర్లకు డిమాండ్‌ పెరుగుతోందని పేర్కొన్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు యోగా గురువులు అనర్హులకు యోగా సర్టిఫికెట్లు అందిస్తున్నారని తెలిపారు. ఒక అసిస్టెంట్‌ టీచర్‌ సర్టిఫికెట్‌కు రూ.5,000 చొప్పున వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. అనర్హులకు సర్టిఫికెట్లు అందిన విషయం నిజమే అన్నారు. దీనికి కొందరు సహకరించినట్లు తెలిపారు. అనర్హులకు యోగా సర్టిఫికెట్లు అందించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

గ్యాస్‌ సిలిండర్‌లో మంటలు

దంపతులకు తీవ్ర గాయాలు



గదిలో నుంచి వస్తున్న మంటలు

జహీరాబాద్‌: గ్యాస్‌ సిలిండర్‌ మంటలు అంటుకొని దంపతులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన జహీరాబాద్‌ పట్టణంలోని ఎస్‌బీహెచ్‌ కాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కాలనీకి చెందిన డి.బసంత్‌రెడ్డి కొత్త సిలిండర్‌ పెట్టి ఆన్‌చేసిన వెంటనే మంటలు అంటుకున్నాయి. పక్కనే ఉన్న భార్య లక్ష్మి భర్తను కాపాడే ప్రయత్నంలో ఆమెకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. వీరిని జహీరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మంటలు గది మొత్తం వ్యాపించడంతో ఫైర్‌ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్‌ అధికారులు, సిబ్బంది జి.నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, యూనస్‌, అశోక్‌ ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. గ్యాస్‌ ఏజెన్సీ సిబ్బంది సైతం చేరుకొని వివరాలు సేకరించారు.



ఎత్తు బంగారం తూకం వేసుకుంటున్న భక్తులు



లారీ నుంచి బెల్లం దిగుమతి చేస్తున్న కార్మికులు

సై సై మేడారం జాతర

ప్రతీ రెండేళ్లకొకసారి జరిగే మేడారం జాతరకు భక్తులు బయలుదేరుతున్నారు. సమ్మక్క సారలమ్మలకు నిలువెత్తు బంగారం (బెల్లం) తూకం వేసి అడవి తల్లులను దర్శించుకునేందుకు పయనమయ్యారు. కోరిన కోర్కెలు తీర్చాలని చిన్నాపెద్ద అనే తారతమ్యం లేకుండా వన దేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. బెల్లం కొనుగోళ్లతో మార్కెట్‌లోని దుకాణాలు కళకళలాడుతున్నాయి.

– హుస్నాబాద్‌

అడవి తల్లుల జాతరకు వేళాయే

- మేడారం వైపు భక్తుల పయనం
- గ్రామాల్లో సైతం సిద్ధం చేస్తున్న గద్దెలు
- సమ్మక్క సారలమ్మలకు నిలువెత్తు బంగారం
- లారీల కొద్ది బెల్లం దిగుమతి

హుస్నాబాద్‌ పట్టణంలోని ప్రతీ దుకాణం ఎదుట బెల్లం కాంటాలు దర్శనం ఇస్తున్నాయి. సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా మేడారంలో నేటి నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. అమ్మవార్లకు బుధ, శుక్రవారం ఇష్టమైన వారాలు కావడంతో భక్తులు నిలువెత్తు బంగారాన్ని ఈ వారాల్లోనే భక్తులు ఎక్కువగా సమర్పిస్తారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు మేడారంలో వనదేవతలు సమ్మక్క సారలమ్మల మండమెలిగే పండుగ ఘనంగా ప్రారంభమైంది. 21వ తేదీ నుంచి 24 వరకు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు.

గ్రామాల్లోనూ అమ్మవార్ల గద్దెలు

మేడారంలో కాకుండా గ్రామాల్లోనూ సమ్మక్క సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మేడారానికి వెళ్లని భక్తులు మొదట ఇంటి వద్ద పూజలు చేస్తారు. అనంతరం బెల్లంను పంచి, మరుసటి రోజు అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. చాలా మంది భక్తులు నిలువెత్తు బంగారంలో సగం బెల్లం, సగం చక్కరతో తూకం వేసుకుంటున్నారు. ఎందుకంటే బెల్లంతో ఎలాంటి ఉపయోగం ఉండదని, చక్కరతో తీపి పదార్థాలు చేసుకోవచ్చని భక్తుల అభిప్రాయం. బెల్లం కిలోకు రూ.37 ఉంటే, చక్కర కిలో రూ.38 ధరలో పెద్దగా తేడా లేకపోవడంతో సగం బెల్లం, సగం చక్కెర తూకం వేసుకుంటున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి బెల్లం

జాతర సందర్భంగా బెల్లం రూ.లక్షల్లో అమ్ముడుపోతుంది. వ్యాపారులు బెల్లంను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. పూణే, లాథూర్‌, నాందేడ్‌ల నుంచి లారీల కొద్ది బెల్లంను దిగుమతి చేసుకుంటున్నారు. ఇప్పటికే పది లారీల బెల్లం దిగుమతి అయిందని, జాతర ముగిసే వరకు మరో 20 లారీల వరకు బెల్లం దిగుమతి అయ్యే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇదే అదనుగా సారా తయారీకి ఈ బెల్లంను తీసుకెళ్లే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఎక్సైజ్‌ అధికారులు బెల్లం వ్యాపారుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. భక్తులకు కాకుండా సారా తయారీ చేసే వారికి బెల్లం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే కొంత మంది బెల్లం వ్యాపారులను తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేశారు.

నిలువెత్తు బంగారం ఇస్తా..



అడవి దేవతలైన సమ్మక్క సారలమ్మలు శక్తి వంతమైన దేవతలు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి ప్రతీ జాతరకు నిలువెత్తు బంగారం ఇస్తా. ఈసారి మా పాప నిలువెత్తు బంగారం ఇస్తానని మొక్కుకున్నాను. తనతో పాటు మా పాప ఎత్తు బంగారం తూకం వేసి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నాను. ప్రతీ జాతరకు మేడారానికి వెళ్లి అమ్మవార్లను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుంటా.

– రేఖ, హుస్నాబాద్‌

పెళ్లి బస్సు, లారీ ఢీ

ఒకరు మృతి, 10 మందికి గాయాలు



లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను తీస్తున్న యువకులు

నిజాంపేట(మెదక్‌): బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, 10 మంది గాయాలయ్యాయి. ఈ ఘటన నిజాంపేట మండల కేంద్రం శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా నంగునూర్‌ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన 20 మంది ఓ ప్రైవేట్‌ టూరిస్ట్‌ బస్సులో పెళ్లి నిమిత్తం మెదక్‌ వెళ్తున్నారు. అలాగే, ఓ లారీ సిద్దిపేట నుంచి రామాయంపేటకు వెళ్తోంది. రామాయంపేట, సిద్దిపేట మధ్య రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతుండగా, కల్వర్టు వద్ద ఇరుకుగా ఉన్న రహదారిపై వేగంగా వచ్చిన లారీ పెళ్లికి వెళ్తున్న బస్సును నిజాంపేట మండల కేంద్ర శివారులో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాలమాకుల గ్రామానికి చెందిన చేర్యాల లింగయ్య, ఆయన భార్య విజయలక్ష్మి, కూతురు లలిత, జయలక్ష్మి, ఎనిమిదేళ్ల మాన్య, డైవర్లు శ్రీనివాస్‌, పొన్నం ప్రభాకర్‌ తీవ్రంగా గాయపడ్డారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. లారీ ఢీకొట్టగానే బస్సు పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. వెంటనే గ్రామస్తులు, పోలీసులు క్షతగాత్రులను బయటకు తీసి చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇందులో తీవ్రంగా గాయపడ్డ లింగయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రామాయంపేట సీఐ వెంకటేశ్‌, ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి ఘటనాస్థలిని సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను చైతన్య పర్చాలి

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్‌: ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహించాలని సిద్దిపేట సీపీ అనురాధ కళాబృందం సభ్యులకు సూచించారు. పోలీసు కమిషనర్‌ కార్యాలయంలో బుధవారం పోలీసు కళాబృందం, జిల్లా సాంస్కృతిక సారథి సభ్యులతో ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాల గురించి సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో మూఢనమ్మకాలు, భానమతి, సైబర్‌ నేరాలు, గృహ హింస, గంజాయి, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, సామాజిక రుగ్మతల గురించి పోలీసు కళాబృందం, తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు కలిసి సమష్టిగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అర్థమయ్యే విధంగా పాటలు, నాటకాల రూపంలో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ రవికుమార్‌, సాంస్కృతిక సారథి సభ్యులు రవి, భాస్కర్‌, రవీందర్‌రెడ్డి, తిరుమల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సీపీ అనురాధతో డీపీఆర్‌ఓ రవి, సాంస్కృతిక సారథి సభ్యులు

విద్యుత్‌ ఆపరేటర్‌ దారుణ హత్య

- మారణాయుధాలతో తలపై మోది
- కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లిలో ఘటన

కొల్చారం(నర్సాపూర్‌): విద్యుత్‌ ఉప కేంద్రంలో పనిచేస్తున్న ఆపరేటర్‌ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్‌ఐ గౌస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం ఉప్పు లింగాపూర్‌ గ్రామానికి చెందిన కట్కూరి నరేశ్‌ (35) అంసాంపల్లి విద్యుత్‌ ఉపకేంద్రంలో ఏడాది నుంచి ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. షిఫ్టింగ్‌ పద్ధతిలో మంగళవారం ఉదయం విధుల్లో చేరాడు. ఉపకేంద్రం ద్వారా రాత్రి 12 గంటలకు త్రీఫేజ్‌ కరెంట్‌ సరఫరా కావాల్సి ఉండగా ఉదయం వరకు రాలేదు. ఉప కేంద్రానికి కొద్ది దూరంలో తండాకు చెందిన ఓ రైతు ఫోన్‌ చేసినా స్విచ్చాఫ్‌ వచ్చింది. ఉదయం రైతు ఉప కేంద్రం గదిలోకి వెళ్లి చూడగా ఆపరేటర్‌ నరేశ్‌ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్‌ఐ, మెదక్‌ రూరల్‌ సీఐ కేశవులు, డీఎస్పీ ఫణీందర్‌ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనపై ఆరా తీయడంతోపాటు డాగ్‌ స్క్వాడ్‌ను రప్పించి ఆనవాళ్ల కోసం వెతికారు. ఘటనపై డీఎస్పీ స్పందిస్తూ.. గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో తలపై బాది చంపి ఉంటారని తెలుస్తోందన్నారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. నరేశ్‌ కొండగట్టు ముత్యంపేట నుంచి 15 ఏళ్ల క్రితం ఉప్పు లింగాపూర్‌ గ్రామానికి చెందిన కోనింటి సుదర్శనం ఇంటికి ఇల్లరికం వచ్చాడని, ఇతడికి భార్య సులోచన, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్‌ ఏరియాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ఘటనా స్థలాన్ని సందర్శించిన మెదక్‌ డీఎస్పీ, (ఇన్‌సెట్లో) మృతుడు నరేశ్‌

అమర జవాన్ల సేవలు మరువలేనివి

కొవ్వొత్తులతో ఘన నివాళులు

హుస్నాబాద్‌: పుల్వామా ఉగ్రవాదుల దాడిలో 42 మంది వీరమరణం పొందిన జవాన్లకు బుధవారం రాత్రి వాసవీ క్లబ్‌ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. అంతకు ముందు మల్లె చెట్టు చౌరస్తా నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. జవాన్లను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ దేశ సేవలో భాగస్వాములు కావాలని క్లబ్‌ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్‌ అధ్యక్షుడు నూక సంపత్‌, ప్రధాన కార్యదర్శి దొమ్మాటి శ్యాంసుందర్‌, కొండూరి శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్‌: అమరులైన జవాన్లకు పౌర సమాజం బుధవారం రాత్రి ఘనంగా నివాళులర్పించింది. పట్టణంలోని స్వామి వివేకానంద చౌరస్తా నుంచి ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా తిరిగి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులతో పాటు పట్టణ యువత, పౌర సమాజం సభ్యులు పాల్గొన్నారు.



గజ్వేల్‌రూరల్‌: ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

శ్మశానంలో పసికందు

బిడ్డను వదిలించుకున్న అమ్మ



శ్మశానంలో దొరికిన పసిగుడ్డు

పుల్‌కల్‌ (అందోల్‌): పుట్టిన మగ బిడ్డకు ఉగ్గపాలు పట్టాల్సిన ఆ తల్లి బిడ్డను శ్మశానవాటికలో పడేసి అమ్మ తనానికే మచ్చ తెచ్చింది. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్‌ మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామంలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామ చివరన ఉన్న శ్మశానవాటికలో బుధవారం తెల్లవారు జామున అటుగా వెళ్తున్న వారికి పసిగుడ్డు కేరింతలు వినిపించాయి. వెళ్లి చూసేసరికి మగ పసికందు మురికి బట్టల్లో కనిపించింది. గ్రామస్తులందరూ వచ్చి పసిగుడ్డును శుభ్రం చేశారు. అక్కడే ఉన్న ఓ మాతృమూర్తి తన పాలు పట్టించింది. వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందించారు. బిడ్డను పెంచుకుంటామని కొందరు మాతృమూర్తులు ముందు కొచ్చారు. కానీ నిబంధనల ప్రకారం శిశువును జిల్లా శిశు సంక్షేమ అధికారులు అంబులెన్స్‌లో సంగారెడ్డి శిశు విహార్‌కు తరలించారు.

అడవి పంది దాడిలో..

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): అడవి పంది దాడిలో వ్యక్తి మృతి చెందిన ఘటన చిలప్‌చెడ్‌ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అజ్జమర్రి గ్రామానికి చెందిన పన్యాల శంకరయ్య (59) పొలం చూసేందుకు వెళ్లగా అడవి పంది దాడి చేసింది. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు నర్సాపూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

బతుకుదెరువు కోసం వచ్చి..

పటాన్‌చెరు టౌన్‌: మొదటి అంతస్తు పైనుంచి పడి మేస్త్రీ మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆసిఫ్‌ అలీ కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మాణిక్‌ లాల్‌ యాదవ్‌ (35) బతుకుదెరువు కోసం మూడేళ్ల కిందట పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు వచ్చి మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌ మల్లికార్జున నగర్‌లో ఓ ఇంటిని నిర్మిస్తున్నారు. అయితే, గోవ కట్టలపై నిల్చొని పని చేస్తుండగా మొదటి అంతస్తు నుంచి జారి పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స కోసం ఇస్నాపూర్‌ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించి, అనంతరం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

- టీఎస్‌ఈఈయూ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి
- విద్యుత్‌ ఎస్‌ఈ కార్యాలయంలో వినతి

మెదక్‌ కలెక్టరేట్‌: ఆర్టిజెన్‌ నరేశ్‌ను హత్య చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని టీఎస్‌యూఈఈయూ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. బుధవారం మెదక్‌ విద్యుత్‌ ఎస్‌ఈ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొల్చారం మండలం అంసాన్‌పల్లి సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజెన్‌ నరేశ్‌ హత్యకు గురి కావడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టి దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. బాధిత కుటుంబానికి విద్యుత్‌ సంస్థ నుంచి రూ.25 లక్షల ఎక్స్‌ గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు నాయకులు స్వామి, నర్సింహులు, యాదగిరి, ఫాసి, భాను, సురేశ్‌, రాములు, మల్లేశ్‌, గౌరి శంకర్‌, పృథ్వీ రాజ్‌, తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హత్య కేసు నిందితుల అరెస్టు

ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు రిమాండ్‌

జోగిపేట(అందోల్‌): హత్య కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. అందోలు మండలం అల్మాయిపేట గ్రామంలో జరిగిన భూ వివాదం విషయంలో వరుసకు మామను అల్లుడు చంపిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి గఫార్‌ అనే వ్యక్తి తానే చంపినట్లు పోలీసులకు లొంగిపోయాడు. కానీ కేసు విచారణలో మరో ఐదుగురు నిందితులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బుధవారం కేసుకు సంబంధించి వివరాలను సీఐ అనీల్‌కుమార్‌ ఎస్‌ఐ అరుణ్‌ కుమార్‌ గౌడ్‌తో కలిసి వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన ఖమ్రొద్దీన్‌, అతడి కుటుంబీకులైన గఫార్‌, కరిష్మాబేగం, మహముబాబేగం, ఎండీ.ఖాదీర్‌, దూదేకుల ఆశియా బేగంలు పొలం వద్ద పనులు చేయిస్తున్నారు. అప్పటికే భూ తగాదా నడుస్తుండడంతో వారి బంధువైన మునీరొద్దీన్‌ అక్కడికి వెళ్లాడు. ఈ భూమిలో తమకు వాటా ఉందంటూ వారితో గొడవకు దిగాడు. మాటామాటా పెరగడంతో ఖమ్రొద్దీన్‌ పక్కనే ఉన్న పారతో మునీరొద్దీన్‌ తలపై బాధడంతో కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న కుటుంబీకులు బండరాళ్లతో మునీరొద్దీన్‌ ముఖంపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇందులో గఫార్‌ ఒక్కడే పోలీసులకు లొంగిపోగా, మిగితావారు పారిపోయారు. వీరికోసం గాలిస్తుండగా సంగుపేట వద్ద కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా, తామే చంపామని ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



మాట్లాడుతున్న సీఐ అనీల్‌కుమార్‌

రెండు నెలలకు స్వగ్రామానికి..

సౌదీ నుంచి బేగంపేట వాసి మృతదేహం

బెజ్జంకి(సిద్దిపేట): రెండు నెలల కిందట సౌదీలో చనిపోయిన ఓ వ్యక్తి మృతదేహం రెండు నెలల తర్వాత బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన చిలుముల కొమురయ్య (60) సుమారు 40 ఏళ్లుగా సౌదీలోని జిద్దాలో సూపర్‌ మార్కెట్‌లో పని చేస్తున్నాడు. నాలుగేళ్లకోసారి స్వగ్రామమైన బేగంపేటకు వచ్చి వెళ్లేవాడు. వీసా పరిమితి అయిపోవడంతో సూపర్‌ మార్కెట్‌ నుంచి బయటకు వచ్చి ఇంటికొస్తుండగా అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఆరోగ్యం క్షీణించగా ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు. వీసా గడువు పూర్తి కావడంతో స్వగ్రామానికి పంపలేదు. గల్ఫ్‌ బాధితుల సంక్షేమ సంఘం సభ్యులు తిరుపతి, మృతుడి కుటుంబ సభ్యులు అధికారులకు అర్జీలు పెట్టినా ఫలితం లభించలేదు. ఇటీవల గవర్నర్‌ను కలిసి విన్నవించారు. ఎట్టకేలకు రెండు నెలలకు మృతదేహం బేగంపేటకు చేరుకుంది. మృతుడికి భార్య దీప, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



కొమురయ్య (ఫైల్‌)

అన్నను చంపిన తమ్ముడు

- వివాహేతర సంబంధం నేపథ్యంలో దారుణ హత్య
- శివ్వంపేట మండలంలో ఘటన

శివ్వంపేట(నర్సాపూర్‌): అన్నను తమ్ముడు దారుణంగా హత్య చేసిన ఘటన మండల పరిధి ఉసిరికపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకలి వెంకటేశ్‌ (30) ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. వెంకటేశ్‌ పెదనాన్న కొడుకు ఎరుకలి నర్సింలు (వరుసకు తమ్ముడు) ప్రైవేట్‌ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇద్దరి ఇళ్లు పక్కపక్కనే ఉంటాయి. తన భార్యతో అన్న వెంకటేశ్‌ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని నర్సింలు అనుమానం పెంచుకున్నాడు. మంగళవారం అర్ధరాత్రి నర్సింలు ఇంటికొచ్చే సమయంలో వెంకటేశ్‌ నరేశ్‌ భార్యతో ఉన్నాడు. వెంటనే ఆవేశంతో నర్సింలు వెంట తెచ్చుకున్న కత్తితో వెంకటేశ్‌ని పలుచోట్ల పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న వెంకటేశ్‌ని చికిత్స నిమిత్తం తరలించేందుకు కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని తూప్రాన్‌ సీఐ కృష్ణ పరిశీలించి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి ఎరుకలి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌ రెడ్డి తెలిపారు.

కార్మికుడి మృతదేహం లభ్యం

పరిశ్రమలో పేలిన రియాక్టర్‌

పటాన్‌చెరు టౌన్‌: పరిశ్రమలో రియాక్టర్‌ పేలిన ప్రమాదంలో కార్మికుడి మృతదేహం లభ్యమైన ఘటన బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌ రెడ్డి కథనం ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్‌ రాష్ట్రం కు చెందిన శ్యాంబాబు(21) బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటున్నాడు. పాశమైలారం పారిశ్రామిక వాడలోని సీఎంహెచ్‌ ల్యాబొరేటరీస్‌ పరిశ్రమలో లేబర్‌ కాంట్రాక్టర్‌ వద్ద పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి పరిశ్రమలో రియాక్టర్‌ పేలిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలైన విషయం తెలిసిందే. అయితే మంటలు పూర్తిగా అదుపులోకి రావడంతో బుధవారం పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించగా కూలిన గోడ కింద కార్మికుడి మృతదేహం లభ్యమైంది. మృతుడు కార్మికుడు శ్యాంబాబుగా గుర్తించి పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



శ్యాంబాబు మృతదేహం

ఇసుక డంప్‌ సీజ్‌

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక డంప్‌ చేశారన్న నమ్మదగ్గ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు బుధవారం రాత్రి దాడులు చేశారు. అక్రమంగా డంప్‌ చేసిన ఇసుకను సీజ్‌ చేసి చిన్నకోడూరు పోలీసులకు అప్పగించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్సై బాలకృష్ణ తెలిపారు.